ఇదేమి చెత్త పాలన !!

నల్లపాడు మార్గంలో ప్రయాణిస్తే ముక్కు మూసుకోవాల్సిందే

- పరిసరాల పరిశుభ్రత-పారిశుద్ధ్యం గాలికి వదిలేసిన అధికారులు
- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న పారిశుద్ధ్య సిబ్బంది
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గుంటూరు రూరల్: పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యాన్ని అటు పారిశుద్ధ్య కార్మికులు, ఇటు మున్సిపల్, పంచాయతీ అధికారులు గాలికొది లేశారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారన్న విమర్శలొస్తున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, మురుగు కాల్వలు శుభ్రపరచకపోవటంతో గ్రామాల్లో ఏ ఇంట్లో చూసినా ఒకరిద్దరు విష జ్వరాల బారిన పడి అల్లాడుతున్నారు. అటువంటి పరిస్థితుల్లో కనీసం ప్రజల ఆరోగ్యాలను పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు కనీసం పరిసరాల పరిశుభ్రతపైనా దృష్టి సారిస్తే బాగుండేదన్న విమర్శలు లేకపోలేదు. మండలంలోని నల్లపాడు ప్రధాన రహదారి గుంటూరు నుంచి సత్తెనపల్లి, నరసరావుపేట హైదరాబాద్‌లకు ప్రధాన రహదారి ఈ దారిలో గ్రామ శివారుల్లో ప్రధాన రహదారిలోనే డంపింగ్ యార్డును తలపించే స్థాయిలో సుమారు 200 మీటర్ల పొడవునా చెత్తను పడేశారు. నెలల తరబడి చెత్తను రోడ్డు పక్కనే పడేయటంతో చెత్త ప్రధాన రహదారిపైకి వచ్చి వచ్చిపోయే వాహనాలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ఈ రోడ్డులో రోడ్డు పక్కనే చెత్త డంపింగ్ చేయటంతో దుర్వాసనకు సమీప గ్రామాల ప్రజలు సైతం ఇళ్ళలో ఉండలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఆ దారిలో వెళ్ళాలంటే ఎంతటివారైనా ముక్కు మూసుకుని పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నల్లపాడు కేంద్రీయ విద్యాలయం ఎదురుగా చెత్త డంపింగ్‌ను పడేస్తున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వచ్చి, అదేవిధంగా స్కూలుకు వెళ్ళే సమయాల్లో బస్సులను ఎక్కిదిగే ప్రదేశం కావటంతో పక్కనే చెత్త డంపింగ్‌తో విద్యార్థులు వారి తల్లిదండ్రులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలకు ఎదురుగా చెత్త డంపింగ్ ఏమిటన్నది తల్లిదండ్రుల ప్రశ్న. వెంగళాయపాలెం, చల్లావారిపాలెం, నల్లపాడు గ్రామాల సరిహద్దు ప్రదేశం లయోలా పాఠశాల ప్రదేశం. ఈ ప్రదేశంలో స్కూల్ పక్కనే డస్ట్ బిన్‌ను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌ను ప్రతి రోజు క్లీన్ చేయకపోయినా కనీసం వారంలో ఒకరోజైనా శుభ్రం చేయటం లేదు. దీంతో చెత్తలో కుక్కలు చేరి చెత్తను రోడ్డుపైకి తెచ్చి పడేస్తున్నాయి. దీంతో చెత్త రోడ్లపై పాఠశాల ప్రాంగణంలోకి, సమీపంలోని ఇళ్లలోకి చేరి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అటు అధికారులు, ఇటు ప్రభుత్వం ఊదరగొట్టు మాటలే తప్ప పనిచేస్తున్న సందర్భాలు లేవని ఆయా గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి గ్రామాలలో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్‌లను అక్కడి నుంచి తీసివేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.



నల్లపాడు-సత్తెనపల్లి ప్రధాన రహదారిలో నల్లపాడు వద్ద రోడ్డుపైకి వస్తున్న చెత్త డంపింగ్

నాడు కళకళ.. నేడు విలవిల

- సచివాలయాలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- కొత్తపింఛన్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం ఎదురుచూపులు

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నెరవేర్చింది. పల్లెల్లోనే ప్రజలకు సత్వరమే సమస్యలు పరిష్కారమయ్యేలా ఏర్పాటైన సచివాలయాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారుతున్నాయి. గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు 545 రకాల సేవలు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల్లో సేవలు నిర్వీర్య మయ్యాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏ ఒక్క ప్రభుత్వ వెబ్‌సైట్ కూడా ఓపెన్ కావడం లేదు. దీంతో కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

పెదకాకాని: మండలంలోని సచివాలయాల్లో సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఉద్యోగులు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలాల్లో 2వేల జనాభా ఉన్న గ్రామాల్లో రూ.40 లక్షలు వ్యయం చేసిఒక నూతన సచివాలయాలు నిర్మించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడంతో లబ్ధిదారులతో సచి వాలయాల్లో సందడి కనిపించేది. మండలంలోని 12 గ్రామాల్లో 19 సచివాయాల నిర్మాణం చేపట్టగా వాటిలో 13 సచివాలయాలకు గత ప్రభుత్వమే ప్రారంభోత్సవం చేసింది.

అన్ని సచివాలయాల్లో ఆయా విభాగాలకు చెందిన ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని వెనిగండ్ల 2 సచివాలయాన్ని మూత పెట్టి పాత పంచాయితీ కార్యాలయంలో చాలీచాలని వసతుల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో రెండు సచివాలయాలు ఒకచోటకే లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నారు. తక్కెళ్ళపాడులో ప్రారంభోత్సవం చేసిన సచివాలయం విధులకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా పథకాలకు సంబంధించిన వెబ్‌సైట్‌లు నిలిపివేయడంతో లబ్ధిదారులు లేక సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.



వెనిగండ్లలో మూతపడిన గ్రామసచివాలయం

నాడు హేళన చేసిన వారితోనే పింఛన్లు పంపిణీ

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు సచివాలయ వ్యవస్థపై అడ్డగోలుగా విమర్శలు చేశారు. సచివాలయాలు ఎందుకు.. అవి అసలు ఉద్యోగాలే కాదంటూ హేళన చేశారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే ప్రస్తుతానికి కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. గతంలో ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్లు వృద్ధులు, వితంతు, వికలాంగులకు సూర్యోదయం కాకముందే ఇంటి వద్ద ఠంచన్‌గా పింఛన్ అందించేవారు.

సచివాలయాల్లో సేవలను కూటమి ప్రభుత్వం పూర్తిగా కుదించింది. కూటమి ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరిట గ్రామాల్లో వారం రోజులపాటు సచివాలయ ఉద్యోగులతో కలిసి టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించే పని అప్పగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది.

కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క పింఛన్, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఎలాంటి సేవలు అందక పోవడంతో లబ్ధిదారులు రాక వెలవెలబోతున్నాయి.అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నిర్లక్ష్యపు విధులు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా సచివాలయ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు వచ్చి ప్రజలకు గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

శివా... శివా!!

- ఇదేమి ఘోరం శంకరా!
- నీ పూజకు కుళ్లిపోయిన కొబ్బరికాయలా?

పెదకాకాని: శివాలయంలో పూజలు చేసేందుకు అధికంగా కుళ్లిపోయిన కొబ్బరికాయలు అందిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యం అభిషేక పూజలు, రాహుకేతు పూజలు జరుగుతూనే ఉంటాయి. వాహన పూజలు, అన్నప్రాసనలు, నవగ్రహ పూజలు సహజంగానే జరుగుతాయి. రాహుకేతు పూజల్లో పాల్గొనే ఒక్కొక్క భక్తుడు 500 రూపాయలతో టిక్కెట్టు కొనుగోలు చేస్తే ఆలయం నుంచి 2 కొబ్బరికాయలు, 250 గ్రాములు మినుములు, 250 గ్రామలు ఉలవలు, ఎరుపు, నలుపు క్లాత్ ముక్కలు, మూర పూలు, 2 అరటిపండ్లు ఒక కిట్‌గా ఇవ్వడం జరుగుతుంది. అలాగే అభిషేక పూజల కోసం 450 రూపాయలు తీసుకుని 2 కొబ్బరికాయలు, పాల ప్యాకెట్, తేనె, పసుపు, కుంకుమ, విభూది, కర్పూరంలతో కూడిన పూజా సామాగ్రి అమ్ముతున్నారు. గత 20 రోజులుగా స్వామి వారి పూజలకు, రాహుకేతు పూజలకు ఆలయంలో 100 కొబ్బరికాయలు వెళితే వాటితో 50 కాయలు కుళ్లిపోతున్నాయని భక్తులు ఫిర్యాదు చేస్తున్నారు. గత మంగళవారం రాహుకేతు పూజలకు కుళ్లిపోయిన కొబ్బరికాయలు ఇవ్వడంపై భక్తులు ఆలయ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమే ఆలయ సిబ్బంది కూడా పూజా సామగ్రి విక్రయించే వారిని హెచ్చరించారు. అయితే ఈ కుళ్లిపోయిన కొబ్బరికాయల విషయమై ఆలయంలో కొబ్బరిచెక్కలు ప్రోగుచేసుకునే పాటదారుడు భాస్కర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆలయంలో పూజా సామగ్రి అమ్ముకునే హక్కును 60 లక్షలకు దక్కించుకోగా, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కును 29,50,000 రూపాయలకు పాటదారులు దక్కించుకున్నారు. కుళ్లిపోయిన కొబ్బరికాయలు అమ్మడంపై ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్‌ను వివరణ కోరగా సమస్య తన దృష్టికి వచ్చిందని పాటదారుడికి నోటీసులిస్తున్నామని తెలిపారు.



పూజలకు పాటదారుడు అందజేసిన కుళ్లిపోయిన కొబ్బరికాయలు ఇవే..

సేంద్రియ వ్యవసాయం రైతుకి శ్రీరామరక్ష



గుంటూరు రూరల్: సేంద్రియ వ్యవసాయం రైతులకు శ్రీరామరక్ష అని తెలంగాణ వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌ను మంత్రి సోమవారం సందర్శించారు. గత 20 సంవత్సరాలుగా రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై వెంకటేశ్వరరావు రైతుల ఉన్నతికి చేస్తున్న కృషిని కొనియాడారు. కేవలం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వడమే కాకుండా, ప్రకృతిలో లభించే ఆకులు, దేశాయ ఆవు మూత్రం, అవుపెడ ద్వారా ఏవిధంగా ఆర్గానిక్ ఎరువులు, ఆర్గానిక్ పెస్టిసైడ్స్ తయారు చేసుకోవాలో ఇక్కడ రైతులకు నేర్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉప్పుటూరి సాంబశివరావు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చేబ్రోలు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం కషి చేయాలని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటల్ లీగల్ అడ్వైజర్ ఎ. విజయలక్ష్మి అన్నారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గుంటూరు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్, ఈవ్ టీజింగ్, ఉమెన్ ట్రాఫికింగ్ లపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి అధ్యక్షత వహించారు. చేబ్రోలు ఎస్ఐ డి వెంకటకష్ణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వలన యువత ఆరోగ్యంతో పాటు జీవితంను నాశనం చేసుకుంటున్నారన్నారు. అనైతిక చర్యలకు పాల్పడటం వల్ల సమాజంలో గౌరవాన్ని కోల్పోడమే కాకుండా చట్టపరిధిలో శిక్షలను అనుభవించవలసి వస్తుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి రాధిక, సూపర్ డెంట్ డి. శ్రీనివాసరావు ఈవోపీఆర్డి ఉషారాణి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ వెంకటకష్ణ, లీగల్ అడ్వైజర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ శ్రీదేవి

కాకుమాను విద్యార్థినికి ప్రథమ స్థానం

కాకుమాను: జాతీయ బాలికా దినోత్సవం, స్వర్ణాంధ్ర 2024లో భాగంగా ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన సేవ్ ద గర్ల్ చైల్డ్ ఉపన్యాస పోటీలలో మండలంలోని కాకుమానుకు చెందిన బొనిగల శాశ్వత జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు ఎంఈవో కె.ఎఫ్.కెనడీ సోమవారం తెలిపారు. విజేతలకు గుంటూరులో జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ ప్రశంసా పత్రాలు,నగదును అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినికి ప్రథమ స్థానం రావడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారనడానికి శాశ్వత నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని శాశ్వతను ఎంఈవో కెనడీ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.సత్యం, ఉపాధ్యాయులు అభినందించారు.



క్లుప్తంగా

వైభవంగా పోతురాజుస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



పొన్నూరు: మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ రేణుకా మాత పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలాది యానాది రావు, మాజీ సర్పంచ్ పిచ్చిరెడ్డి, అక్కిరెడ్డి, మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పది రూపాయల నాణాలపై అపోహలు వీడాలి



పొన్నూరు: రూ.10 కాయిన్‌లు చెల్లుబాటు కావని వస్తున్న పుకార్లను నమ్మవద్దని బ్యాంక్ ఆఫ్ ఇండియా పొన్నూరు బ్రాంచ్ మేనేజరు మోహన్‌కృష్ణ అన్నారు. సోమవారం బ్యాంకు ఆవరణలో రూ. 10 కాయిన్‌ల మేళా నిర్వహించారు. మోహన్ కృష్ణ మాట్లాడుతూ ఆర్బీఐ పిలుపు మేరకు పది నాణేలపై ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వ్యాపారులు రూ.పది నాణేలను తిరస్కరించవద్దని తెలిపారు. ఎలాంటి ఆందోళన లేకుండా బ్యాంకులో మార్చుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులకు రూ. 10 కాయిన్‌లను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం

పెదకాకాని: సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి తెలిపారు. పెదకాకాని మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్ద సోమవారం ఉచితంగా ఎలుకల మందు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేసే ఎలుకల మందు తీసుకునేందుకు రైతులు వరినూక, నూనె తప్పక తీసుకువచ్చి రైతు సేవా కేంద్రాల వద్ద కలుపుకుని తీసుకు వెళ్లాలన్నారు. అదే రోజు రైతులందరూ తమ పొలాల్లోని బొరియల్లో మందు పెట్టడం ద్వారా సామూహిక ఎలుకల నివారణ జరుగుతుందని ఎఒ పి సంధ్యారాణి తెలియజేశారు.

వట్టిచెరుకూరు పరిధిలో...

గుంటూరు రూరల్: నేడు మంగళవారం ఉదయం నుంచి వట్టిచెరుకూరు మండలంలో వరి పండిస్తున్న గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాలను మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి కె లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎలుకల మందును నూరుశాతం సబ్సిడీతో రైతులకు అందజేయటం జరుగుతుందన్నారు. పొలం గట్లపై ఏర్పాటు చేసేందుకు ఎలుకల నివారణకోసం రైతులు, నూకలు, నూనె తీసుకుని గ్రామ పంచాయితీ కార్యాలయాలవద్దకు చేరుకోవాలని సూచించారు. ప్రతి వరి పండించే రైతు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

పాఠశాలలు సమాజానికి ప్రతిబింబాలు

ఎంఈవో గరిమెళ్ళ సత్యనారాయణమూర్తి



గుంటూరు రూరల్: పాఠశాల సమాజానికి ప్రతిబింబమని, సమాజం నుంచి పాఠశాలకు ఎప్పుడూ సహకారం లభిస్తూ ఉంటేనే విద్యార్థులు పరిపుష్టంగా ఉంటారని వట్టిచెరుకూరు మండల ఎంఈవో గరిమెళ్ళ సత్యనారాయణమూర్తి అన్నారు. బండి సాహితిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండి అశోకరెడ్డి, సుధావాణి దంపతులు బండి సాహితిరెడ్డి స్మత్యర్థం లేమల్లెపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు యాభైవేల రూపాయల విలువైన క్రీడాపరికరాలను సోమవారం వితరణ చేశారు. విద్యార్థులు శారీరక మానసిక పరిణతి పొందటానికి క్రీడలు దోహదం చేస్తాయని, అందుకే పాఠశాలకు ఆటసామగ్రిని సమకూర్చామని బండి అశోకరెడ్డి అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శ్రీధర్, ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ పచ్చల ఎస్తేరురాణి, ఉప చైర్మన్ పానుగంటి చైతన్య, గ్రామ ఉపసర్పంచ్ వల్లాపురపు సత్యనారాయణ, గ్రామపెద్దలు పాతూరి కృష్ణారావు, కొణిజేటి బులిబాబు,కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

పెదకాకాని: ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పెదకాకాని గ్రామానికి చెందిన పెండ్యాల సురేష్ సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫిర్యాదుల దినోత్సవ కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. పెదకాకాని ప్రధాన సెంటర్‌లో శివాలయం ఆర్చి ప్రక్కనే సర్వేనెంబరు 557 లో 25 సెంట్లు ప్రభుత్వ స్థలం ఉంది. ఆ స్థలంలో ఉన్న గ్రంథాలయం శిథిలావస్థకు చేరడం, రహదారి విస్తరణతో గ్రంథాలయం స్థలం రోడ్డులో కలసి పోయింది. ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని 2014 సంవత్సరంలో భవానీ మహిళా ట్రస్ట్ పేరుతో ఆక్రమించుకున్నారు. ఆ స్థలాన్ని పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్నప్పటికీ న్యాయస్థానాన్ని తప్పుడు సమాచారంతో నమ్మించి స్టే తెచ్చారన్నారు. వాస్తవానికి ఆ ట్రస్ట్ గ్రామానికి చెందిన తల్లి, కుమార్తెలు మాత్రమే ఉన్నారని, ఆ స్థలాన్ని వారే ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ స్థలం ఎదురుగా రోడ్లపై చిరువ్యాపారాలు చేసుకునే వారి వద్ద నుంచి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారన్నారు. ఆ స్థలాన్ని పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకుని గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయం నిర్మించాలని పెండ్యాల సురేష్ గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేశారు.

24 నుంచి ఆహ్వాన నాటిక పోటీలు

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో అల్లు రామలింగయ్య నాటక కళాపరిషత్- వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పి.శివప్రసాద్ తెలిపారు. సోమవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నాటికల బ్రోచర్లను విడుదల చేశారు. చివరి రోజు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు ఆర్.రామకృష్ణ, కార్యదర్శి దళవాయి సుబ్రమణ్యం, కోశాధికారి తట్టల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాలెడ్జ్, స్కిల్స్ పెంపొందాలి

ఎన్ఐటీటీటీఆర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ మైత్రేయీ దత్త



చేబ్రోలు: విద్యార్థుల్లో నాలెడ్జ్‌తో పాటు స్కిల్స్‌ను పెంపొందించాలని చండీఘర్‌లోని ఎన్ఐటీటీటీఆర్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్ ట్రె నింగ్ అండ్ రీసెర్చ్) ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ మైత్రేయీ దత్త అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో '' అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) అండ్ అక్రిడిటేషన్'' అనే అంశంపై 5 రోజుల పాటు నిర్వహించనున్న ట్రైనింగ్ ప్రోగ్రాంను సోమవారం వైస్ చాన్సలర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చండీఘర్‌లోని ఎన్ఐటీటీటీఆర్- ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ మైత్రేయీ దత్త మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక, సామాజిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వాటిని ఉపయోగించి వారు భవిష్యత్‌లో ఎలా నిలదొక్కుకుంటారనే అంశాలను బట్టి వారి విద్యా ప్రయాణం ఉంటుందనేదే ఓబీఈ విధానంలోని ప్రత్యేకతని తెలియజేసారు. ఈ విధానంలో విద్యార్థులు చదువుతున్న సబ్జెక్టు ఫలితాలు ముందే నిర్దేశించబడతాయన్నారు. వాటి ఆధారంగా విద్యా కార్యక్రమాలు, బోధన పద్ధతులు రూపకల్పన చేస్తామన్నారు.

విద్యార్థులు సబ్జెక్టులను మాత్రమే నేర్చుకోకుండా వారి నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించడానికి ఓబీఈ తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల ఆలోచనా పద్ధతులు, పరిష్కార నైపుణ్యాలను పొందేందుకు ఇది సహాయపడుతుందని తెలియజేశారు. మార్కెట్ అవసరాలకనుగుణంగా విద్యా విధానం ఉండేలా విద్యార్థులను సిద్ధం చేస్తుందన్నారు. నైపుణ్యాలను ప్రాధాన్యతగా తీసుకోవడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని వెల్లడించారు. విద్యార్థులు కేవలం సబ్జెక్టుల ను మాత్రమే కాకుండా వ్యావహారిక పరిజ్ఞానం పొందడం వలన సమగ్ర అభ్యాసం పొందుతారని తెలి పారు. విద్యార్థులు లక్ష్యాలను ఎలా సాధిస్తున్నారు అనేది పరిశీలించి, వారి పనితీరును జాగ్రత్తగా మూల్యాంకనం చేస్తామన్నారు. విద్యార్థుల వ్యక్తిగత, వత్తి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించే ప్రాక్టికల్ పనితీరు, అనుభవం ఆధారంగా ర్యాంకులు కాకుండా ఫలితాల ఆధారంగా గుర్తింపు వస్తుందన్నారు. విద్యా సంస్థల ప్రదర్శన ప్రమాణాలను, వారి చదువు ప్రణాళికలను విశ్లేషించి అక్రిడిటేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఏఐసీటీఈ, ఎన్‌బీఏ వంటి గుర్తింపు సంస్థలు ఓబీఈ పద్ధతులను పాటించే సంస్థలకు గుర్తింపు ఇస్తాయన్నారు. అక్రిడిటేషన్ అనేది విద్యాసంస్థలు, ముఖ్యంగా ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో, నాణ్యత ప్రమాణా లను పాటిస్తున్నాయా లేదా అని జాగ్రత్తగా పరిశీలించి గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్ ఉండటం వల్ల విద్యాసంస్థలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందడంతో పాటు విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

నంబూరులో జనావాసాల మధ్య బ్రాందీషాపు

తొలగించాలంటూ నిరసన వ్యక్తం చేసిన మహిళలు


పెదకాకాని: నంబూరు గ్రామంలో జనావాసాల మధ్య బ్రాందీషాపు ఏర్పాటు చేయడం పట్ల స్థానికుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో ఈనెల 16వ తేదీన ఒక బ్రాందీషాపు, నంబూరు శివార్లలోని కంతేరు అడ్డరోడ్డు వద్ద ఒక బ్రాందీషాపు ప్రారంభించారు. అదే గ్రామంలో సోమవారం సాయంత్రం మరొక బ్రాందీషాపు ప్రారంభించారు. పెదకాకాని మండలానికి నాలుగు బ్రాందీషాపులు మంజూరు కాగా వాటిలో మూడు షాపులు నంబూరు ఏరియాలోనే ఏర్పాటు చేయడం జరిగింది. నూతనంగా ప్రారంభించిన షాపుకు 20 మీటర్ల దూరంలో నంబూరు 3, 4 సచివాలయాలు ఉండటంతో పాటు 50 మీటర్ల దూరంగా శ్రీగంగానమ్మ తల్లి ఆలయం ఉంది. దీంతో రాత్రి 9 గంటలకు స్థానిక మహిళలు అక్కడికి చేరుకుని నిత్యం మహిళలు, పిల్లలు తిరిగే ప్రదేశంలో బ్రాందీషాపు ఏర్పాటు చేయడంపై అడ్డుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఈ రోజు కొనసాగించాలని, మంగళవారం ఎక్సైజ్‌శాఖ అధికారుల సమక్షంలో సమస్య పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి గంగానమ్మ అమ్మవారి ఆలయం, సచివాలయం మధ్యన ఉన్న షాపును తొలగించి వేరొక ప్రాంతానికి మార్చాలని స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. షాపును ఇళ్ళ మధ్య నుంచి తొలగించే వరకూ ఆందోళనలు ఆపేది లేదని మహిళలు పేర్కొన్నారు. వివాదం జరుగుతున్న ప్రాంతానికి పలువురు గ్రామ ప్రజలు, యువకులు చేరుకుని ఇళ్ల మధ్యలో అమ్మవారి ఆలయం దగ్గర బ్రాందీషాపు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నంబూరులో ఇళ్ల మధ్య బ్రాందీషాపు తొలగించాలని ఆందోళన చేస్తున్న మహిళలు

యువకుడు ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: కుటుంబ సమస్యల కారణంతో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నకు పాల్పడిన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో సోమవారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన కె.వెంకటేష్, కుటుంబ సమస్యలతో గత కొద్దిరోజులుగా సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేష్‌ను 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది.



ఆత్మహత్యాయత్నం చేసిన వెంకటేష్